మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

మాచర్లలో ఖాకీల అండతో పచ్చ గూండాల దాడులు

- అరాచకాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులా?
- పిన్నెళ్లి రామకృష్ణారెడ్డి ధ్వజం

పల్నాడు జిల్లా: మాచర్లలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వైయస్ఆర్సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, బీ ఫారాలు చించివేయడం, బీరువా గుర్తుతో ప్రచారం చేస్తున్న వారిపై దాడులకు పాల్పడటంపై వైయస్ఆర్సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెళ్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల అండతో కూటమి నేతలు దాడులకు పాల్పడుతున్నారని, బాధితులపైనే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. తనపై 19 కేసులు నమోదు చేసి బెయిల్ రద్దు చేస్తామంటూ బెదిరిస్తున్నా పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. మాచర్ల క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు.

మాచర్లలో పోలీసుల అండతో దాడులు.. బాధితులపైనే కేసులు

మాచర్లలో ఓటమి భయంతోనే టీడీపీ నామినేషన్ల నుంచి ప్రచారం వరకు అడ్డంకులు సృష్టిస్తోంది. బీ ఫారాలు చించివేసినా మా అభ్యర్థులు బీరువా గుర్తుతో ప్రజల్లోకి వెళ్లి మద్దతు కోరుతున్నారు. మైనారిటీ మహిళ సుల్తానాను చైర్పర్సన్ అభ్యర్థిగా నిలబెట్టడంతో ఏజెంట్ ఫారాల సమర్పణ సమయంలో రౌడీ, గంజాయి బ్యాచ్లతో దాడులు చేయించారు. ఎన్నికల అధికారి, కమిషనర్, పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. కారంపూడి, దుర్గి, వెల్దుర్తి, నాగార్జునసాగర్ ప్రాంతాల్లోనూ పోటీ చేయవద్దంటూ పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ ఘటనలపై జిల్లా ఎస్పీకి, ఎస్ఈసీకి



ఆధారాలతో ఫిర్యాదు చేశాం. బాధ్యులెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

మాచర్ల అభివృద్ధి మా హయాంలోనే.. కూటమి హామీలేవీ?

వైయస్ జగన్ ప్రభుత్వ హయాంలో మాచర్లలో రింగ్ రోడ్డు నిర్మాణం, ఆసుపత్రి విస్తరణ, 5,400 మంది పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టాం. కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని, రాష్ట్రంలో 6.40 లక్షల పెన్షన్లు తొలగించిందని పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గంలో 6,400 మందికిపైగా తల్లులకు అమ్మఒడి నిలిపివేశారని తెలిపారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి, 20 లక్షల ఉద్యోగాలు వంటి హామీలు అమలు కాలేదన్నారు. వైయస్ జగన్ హయాంలో అమ్మఒడి, చేయూత, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలతో పేదలకు అండగా నిలిచామని గుర్తుచేశారు.

19 కేసులు పెట్టినా భయపడం.. 36 మంది అభ్యర్థులకు అండగా ఉంటాం

నామినేషన్ వేసినప్పటి నుంచి తనను హౌస్ అరెస్ట్ చేశారని, గతంలో ఉన్న 18 కేసులకు మరో కేసు జోడించి 19 చేశారని పిన్నెళ్లి తెలిపారు. బుర్రిపాలెం జంట హత్యల కేసులో 98 రోజులు జైలులో ఉంచారని, ఇప్పుడు బెయిల్ రద్దు చేస్తామంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, వైయస్ఆర్సీపీకి చెందిన 36 మంది అభ్యర్థులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అభ్యర్థులపై దాడులు, బెదిరింపుల ఘటనలపై ప్రత్యేక దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు స్వేచ్ఛగా ఎన్నికల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని పిలుపునిచ్చారు.

ఎన్ని కుట్రలు చేసినా మా విజయాన్ని ఆపలేరు: సుల్తానా, వైయస్ఆర్సీపీ బలపరిచిన మాచర్ల మున్సిపాలిటీ చైర్పర్సన్ అభ్యర్థి

తనను అభ్యర్థిగా బలపరిచిన వైయస్ జగన్మోహన్రెడ్డి, పిన్నెళ్లి రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డికి సుల్తానా కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ మహిళగా తనకు, ఇతర అభ్యర్థులకు ఎన్నో అడ్డంకులు సృష్టించారని చెప్పారు. ఫ్యాన్ గుర్తు లేకపోయినా బీరువా గుర్తుతో ఇంటింటికీ వెళ్లి ప్రజల మద్దతు పొందామని, రేషన్ కార్డులు, వాలంటీర్ ఉద్యోగాల తొలగింపు, తాగునీరు, రోడ్లు, కాలువల సమస్యలను ప్రజలు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. జగనన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని, ఎన్ని కుట్రలు చేసినా ప్రజల అభిమానంతో తమ విజయాన్ని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.